తెలంగాణ

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం - 13- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 39 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


# రేవంత్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు

**రైతులకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్**

**కాంగ్రెస్‌పై ఘాటు ఆరోపణలు**

**తెలంగాణ ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ విమర్శలు**

హైదరాబాద్, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రైతులు సాగునీటి కోసం ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. రైతులకు నీళ్లు అందించాల్సిన ప్రభుత్వం వారిని అవమానించే విధంగా మాట్లాడటం సరికాదని మండిపడ్డారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కేటీఆర్ మాట్లాడుతూ, "నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతా" అనే వ్యాఖ్యలు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తికి తగవని అన్నారు. నీటి కోసం వేడుకుంటున్న రైతులకు పరిష్కారం చూపాల్సింది పోయి, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

మిగతా 2లో







# మైనింగ్ లీజుతో సింగరేణికి కొత్త ఊతం

**తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌కు విజయోత్సవాలు**

**ఇల్లందు ఏరియాలో ఘనంగా సంబరాలు**

**రెండు వేల మందికి ఉపాధి అవకాశాలు**

ఇల్లందు, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు): తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు కేంద్ర ప్రభుత్వం మైనింగ్ లీజ్ మంజూరు చేయడంతో సింగరేణి సంస్థ వ్యాప్తంగా నిర్వహిస్తున్న విజయోత్సవాలు ఆదివారం ఇల్లందు ఏరియాలో ఘనంగా జరిగాయి. కోయగూడెం బహిరంగ గని, జేకే-5 బహిరంగ గని, ఏరియా వర్క్‌షాప్, ఏరియా ఆసుపత్రి, భద్రతా విభాగం తదితర శాఖల్లో అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టులు, ప్రణాళిక) కె. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కార్మికులు ఒకరికి ఒకరు మిఠాయిలు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో మాట్లాడిన డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక కృషి ఫలితంగానే తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజ్ మంజూరైందని తెలిపారు. ఈ లీజ్ సింగరేణి సంస్థ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌లో సుమారు 300 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని,

మిగతా 2లో

# రాజ్‌కుమార్ కోసం 12 బృందాలతో వేట

- సీసీటీవీ ఫుటేజీలు, సిమ్ కార్డు వివరాలతో నిందితుడి కదలికలపై నిశిత పరిశీలన
- కర్ణాటక మార్గాలతో పాటు జాతీయ రహదారి–44పై ప్రత్యేక నిఘా, హోటళ్లు–లాడ్జీల్లో తనిఖీలు
- పోక్సో కేసుపై కక్షతో అరగంటలో మూడు ప్రాంతాల్లో ఆరుగురి దారుణ హత్య
- నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల బహుమతి.. షాబాద్ ఎస్సై సస్పెన్షన్



హైదరాబాద్, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు): రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. గాలింపు బృందాల సంఖ్యను 10 నుంచి 12కు పెంచారు. నిందితుడి కదలికలను గుర్తించేందుకు అతడు ఉపయోగించిన సిమ్ కార్డులతో పాటు బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు పారిపోయి ఉండొచ్చనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక, ఇతర ప్రాంతాలకు వెళ్లే హైవేలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. 44వ నంబర్ జాతీయ రహదారి వెంబడి ఉన్న హోటళ్లు, దాబాలు, లాడ్జీల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు.

మిగతా 2లో

# అంబర్‌పేటలో కిషన్ రెడ్డి పాదయాత్ర

**స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి**

**బస్తీలు, కాలనీల్లో ప్రజలతో ముఖాముఖి**

**స్థానిక సమస్యలు తెలుసుకున్న కిషన్ రెడ్డి**

హైదరాబాద్, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు): కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అంబర్‌పేట డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని స్థానికులతో మమేకమయ్యారు. పటేల్‌నగర్ చౌరస్తా, న్యూ పటేల్‌నగర్, చెన్నారెడ్డినగర్ ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టిన కిషన్ రెడ్డి స్థానిక కాలనీలు, బస్తీలను సందర్శించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, స్థానిక అవసరాలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని

మిగతా 2లో







# జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మీసాల ప్రకాశ్ ప్రమాణం

- ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ
- విజ్ఞాన సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలే పునాది
- విద్యా వికాసంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్ష

వరంగల్, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు): వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన చైర్మన్‌గా మీసాల ప్రకాశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన చైర్మన్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా, విజ్ఞానవంతులుగా ఎదగడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. చదువుతో పాటు ఆలోచనా శక్తిని పెంపొందించడంలో గ్రంథాలయాల సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు చదివే కేంద్రాలు మాత్రమే కాకుండా విజ్ఞానాన్ని పంచే వేదికలుగా అభివృద్ధి చెందాలని మంత్రి సూచించారు. యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. నూతన చైర్మన్ మీసాల ప్రకాశ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జిల్లా గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన గ్రంథాలయ సేవలు అందించేలా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రంథాలయ సంస్థ సభ్యులు, ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నూతన చైర్మన్‌కు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జూబ్లీహిల్స్‌లో ఫెరారీ బీభత్సం



- అపార్ట్‌మెంట్ గేటును ఢీకొట్టిన లగ్జరీ కారు
- కోట్ల విలువైన వాహనం ధ్వంసం.. పరారైన ప్రయాణికులు
- మద్యం మత్తులోనే ప్రమాదమా? పోలీసుల దర్యాప్తు

హైదరాబాద్, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఆదివారం తెల్లవారుజామున కోట్ల రూపాయల విలువైన ఫెరారీ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చిన కారు అదుపుతప్పి ఫోర్ట్ వ్యూ అపార్ట్‌మెంట్స్ ప్రధాన గేటును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-5లో ఈ ఘటన జరిగింది. సుమారు రూ.3.50 కోట్లకు పైగా విలువ చేసే ఫెరారీ రోమా కారు అపార్ట్‌మెంట్ గేటును ఢీకొనడంతో గేటు పూర్తిగా ధ్వంసమైంది. అదే సమయంలో కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది.

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




# మైనింగ్ లీజుతో సింగరేణికి కొత్త ఊతం

(మొదటి పేజీ తరువాయి)

ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఈ గనికి ఉంటుందని వివరించారు. దాదాపు 45 సంవత్సరాల గని జీవితకాలం ఉండనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ బొగ్గు బ్లాక్ అభివృద్ధితో సింగరేణి సంస్థతో పాటు తెలంగాణ పారిశ్రామిక రంగానికి మరింత బలం చేకూరుతుందని అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి, పరిశ్రమల అవసరాలకు బొగ్గు సరఫరా పెరగడంతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# రేవంత్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)




తెలంగాణ ప్రజలపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చరిత్రను ఎవరూ మర్చిపోలేరని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమాల్లో జరిగిన కాల్పులు, ప్రాణత్యాగాలను గుర్తు చేస్తూ, తెలంగాణ ప్రజల రక్తంతో కాంగ్రెస్ పార్టీ చరిత్ర ముడిపడి ఉందని ఆరోపించారు. 1952 ఉద్యమం, 1969 తెలంగాణ ఉద్యమం, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో అనేక మంది యువకులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం వేలాది మంది యువకులు, విద్యార్థులు, ఉద్యమకారులు తమ జీవితాలను త్యాగం చేశారని కేటీఆర్ అన్నారు. అలాంటి చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మళ్లీ తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించడం మానేసి రాజకీయ విమర్శలకే పరిమితమైందని విమర్శించారు.

రైతులకు సాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు నీటి కోసం నిరసనలు తెలపాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యమేనని పేర్కొన్నారు. నీటి సమస్యను పరిష్కరించకుండా రాజకీయ వ్యాఖ్యలతో కాలక్షేపం చేయడం సమంజసం కాదన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాము ఎన్నో పోరాటాలు చేశామని, ప్రజల కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని కేటీఆర్ తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. అవసరమైతే రైతుల తరఫున మరోసారి ఉద్యమానికి సిద్ధమని స్పష్టం చేశారు.

ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని, రైతులకు సాగునీరు అందించి వారి ఇబ్బందులను తొలగించాలని కేటీఆర్ కోరారు. రాజకీయ విమర్శలకు బదులుగా అభివృద్ధి, సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే మాటలకన్నా చేతల్లో పాలన కనిపించాలని ఆయన వ్యాఖ్యానించారు.



# అంబర్‌పేటలో కిషన్ రెడ్డి పాదయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన నగరాన్ని నిర్మించవచ్చని అన్నారు.

పాదయాత్ర సందర్భంగా స్థానికులు చూపిన ఆదరణకు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తెలిపిన సూచనలు, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉంటానని కిషన్ రెడ్డి తెలిపారు.

# ఆరేళ్ల చిన్నారితో కారు నడిపించిన ఎస్ఐ?

- రంగారెడ్డి జిల్లాలో ఘటన కలకలం
- ప్రశ్నించిన వారిపై దురుసుగా స్పందించారనే ఆరోపణ
- వీడియో వైరల్.. దర్యాప్తు కోరుతున్న స్థానికులు






**హైదరాబాద్, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):** రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ పోలీసు అధికారి వ్యవహారంగా ప్రచారం జరుగుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మెయిన్ రోడ్డుపై తన ఆరేళ్ల మనవరాలికి కారు డ్రైవింగ్ నేర్పిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా, వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. ప్రచారంలో ఉన్న వివరాల ప్రకారం, ఓ ఎస్ఐ తన మనవరాలిని డ్రైవింగ్ సీటులో కూర్చోబెట్టి ప్రధాన రహదారిపై కారు నడిపించినట్లు చెబుతున్నారు. ఈ విషయం గమనించిన స్థానికులు చిన్నారితో రోడ్డుపై వాహనం నడపించడం ప్రమాదకరమని అభ్యంతరం వ్యక్తం చేశారు.

అయితే దీనిపై ప్రశ్నించిన వారితో ఎస్ఐ దురుసుగా వ్యవహరించారని, "నా ఇష్టం... నన్ను అడగడానికి మీరెవరు?" అని సమాధానం ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పలువురు నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. చిన్నారులకు వాహనాలు నడిపేందుకు అనుమతించడం మోటారు వాహనాల చట్టానికి విరుద్ధమని, ప్రజలకు చట్టాలను అమలు చేయాల్సిన బాధ్యత ఉన్న అధికారులే నిబంధనలు ఉల్లంఘిస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

అయితే ఈ ఘటనపై పోలీసు శాఖ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. వీడియోలో కనిపిస్తున్న వ్యక్తి, ఘటన జరిగిన పరిస్థితులు, ఆరోపణల వాస్తవాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. దర్యాప్తు అనంతరం మాత్రమే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# రాజ్‌కుమార్ కోసం 12 బృందాలతో వేట

(మొదటి పేజీ తరువాయి)



తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో తొలుత బాలిక తల్లి, నానమ్మలను రాజ్‌కుమార్ కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. ఈ ఆరు హత్యలు గంటల్లోనే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపాయి. పరారీలో ఉన్న నిందితుడిని పట్టిస్తే.. రూ.2 లక్షల నగదు బహుమతి ఇస్తామని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు ఇప్పటికే ప్రకటించారు. ఈ ఘటన అనంతరం పోలీసు ఉన్నతాధికారులు షాబాద్ ఎస్సై రమేశ్‌ను సస్పెండ్ చేశారు.



# గిన్నిస్ రికార్డు విజేతలకు సన్మానం

- హనుమకొండ విద్యార్థులకు మంత్రి అభినందనలు
- ప్రపంచ వేదికపై తెలంగాణ ప్రతిభ
- భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

**హైదరాబాద్, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):** గచ్చిబౌలి స్టేడియంలో ఇటీవల నిర్వహించిన కరాటే ప్రదర్శనలో గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించి తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన హనుమకొండ జిల్లా భీమారం ప్రాంతానికి చెందిన ఐదుగురు విద్యార్థులను రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులను అభినందిస్తూ, చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో సాధించిన ఈ విజయం మరెందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.

ప్రపంచ స్థాయిలో గిన్నిస్ రికార్డు సాధించడం ద్వారా తెలంగాణ యువతలో అపార ప్రతిభ ఉందని మరోసారి నిరూపితమైందని మంత్రి తెలిపారు. ఇలాంటి విజయాలు రాష్ట్ర క్రీడారంగానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణతో పాటు దేశానికి పేరు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు. వారి తల్లిదండ్రులు, శిక్షకులు అందించిన ప్రోత్సాహం, శ్రమ అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థులను మంత్రి ప్రత్యేకంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే యువతకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని పేర్కొన్నారు.

గిన్నిస్ రికార్డు విజేతలకు సన్మానం

# వనస్థలిపురంలో దారుణ హత్య

- రోడ్డు పక్కన రక్తపు మడుగులో మృతదేహం
- అనేక కత్తిపోట్లతో వ్యక్తి హత్య
- నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు



**హైదరాబాద్, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రాంతంలో ఆదివారం ఉదయం దారుణ హత్య కలకలం రేపింది. పనామా కూడలి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తిని దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేసి రోడ్డు పక్కన పడవేసి పరారయ్యారు. రక్తపు మడుగులో మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై అనేక కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. హత్య అత్యంత దారుణంగా జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

మృతుడు ఎవరనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అతని గుర్తింపునకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. వ్యక్తిగత కక్షలు, పాత విభేదాలు లేదా ఇతర కారణాల వల్ల ఈ ఘటన జరిగి ఉండొచ్చనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సంఘటనా స్థలం పరిసరాల్లోని సీసీటీవీ దృశ్యాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# జూబ్లీహిల్స్‌లో ఫెరారీ బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్న డ్రైవర్‌తో పాటు ఇతరులు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ధ్వంసమైన కారును టోయింగ్ వాహనం సాయంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతివేగంతో పాటు మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కారులో ఎంతమంది ఉన్నారు, ప్రమాదం సమయంలో వాహనాన్ని ఎవరు నడిపారు అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఇటీవలి రోజుల్లో జూబ్లీహిల్స్‌లో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. జూలై 9న రాత్రి రోడ్ నంబర్-10లో ప్రముఖ సినీ నటుడు ధర్మ నివాసం కాంపౌండ్ గోడను ఓ ఎస్‌యూవీ ఢీకొట్టిన ఘటన మరువకముందే మరో ప్రమాదం చోటుచేసుకుంది. ఆ ఘటనలో మద్యం మత్తులో వాహనం నడిపిన కార్తీక్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తాజా ఘటనతో జూబ్లీహిల్స్‌లో లగ్జరీ కార్ల అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌పై మరోసారి చర్చ మొదలైంది. ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి పరారైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



# సంగీతం, సాహిత్యం, కళల్లో పిల్లలను ప్రోత్సహించాలి



- **పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**

**మహబూబ్‌నగర్,జూలై12(తెలంగాణ ముచ్చట్లు):** సంగీతం, సాహిత్యం, కళా రంగాల్లో పిల్లలను చిన్ననాటి నుంచే ప్రోత్సహిస్తే వారి ప్రతిభ వెలుగులోకి రావడంతో పాటు నైతిక విలువలు కూడా పెంపొందుతాయని వనపర్తి జిల్లా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని భగీరథ కాలనీలో నివాసముంటున్న యాదమ్మ-శ్రీనివాస్ దంపతుల కుమారుడు, బాల గాయకుడు ఎన్‌బీఆర్ సాత్విక్‌ను పలుస శంకర్ గౌడ్ ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్ననాటి నుంచే తల్లిదండ్రులు అందించే ప్రోత్సాహమే పిల్లలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు. ఎన్‌బీఆర్ సాత్విక్ చిన్న వయస్సులోనే గాయకుడిగా ప్రతిభ కనబరుస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల్లో ఉన్న ఆసక్తిని గుర్తించి సంగీతం, సాహిత్యం, కళారంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. తద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందుతాయని తెలిపారు.బాల గాయకుడిగా సాత్విక్‌ను తీర్చిదిద్దుతున్న తల్లిదండ్రులు యాదమ్మ, శ్రీనివాస్‌లను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో అమ్మాపూర్ ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా పెద్దమారు ధనలక్ష్మి



**వనపర్తి,జులై12(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా వనపర్తి పట్టణ 21వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి పెద్దమారు ధనలక్ష్మి ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో మొత్తం 127 ఓట్లు పోలవగా, ఆమెకు 81 ఓట్లు లభించడంతో అధ్యక్షురాలిగా ఘన విజయం సాధించారు.ఈ సందర్భంగా నంది హిల్స్‌లోని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నివాస కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలు పెద్దమారు ధనలక్ష్మితో పాటు అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జిల్లా రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అధ్యక్షురాలిగా ఎన్నికైన పెద్దమారు ధనలక్ష్మి మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల సంక్షేమం, మిల్లర్ల సమస్యల పరిష్కారం, అసోసియేషన్ బలోపేతానికి అందరినీ కలుపుకొని పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర సంఘం హనుమకొండ జిల్లా యూత్ కార్యదర్శిగా గొల్లెన రమేష్ ఎన్నిక



**వేలేరు, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమకొండలో జరిగిన సమావేశంలో వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన గొల్లెన రమేష్‌ను హనుమకొండ జిల్లా యూత్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, యువత సంక్షేమం, సంఘ బలోపేతం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వడ్డెర యువత అభివృద్ధికి కృషి చేస్తానని రమేష్ తెలిపారు.

# శాశ్వత వైద్యుల నియామకం చేపట్టాలి





- **సత్తుపల్లి ఏరియా ఆసుపత్రిలో సీపీఎం నేతల పరిశీలన.**
- **వైద్యులు, సిబ్బంది కొరతతో సేవలు దెబ్బతింటున్నాయని ఆందోళన.**

**సత్తుపల్లి, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆసుపత్రిని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. నూతనంగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రిలో 59 మంది వైద్యుల పోస్టులు ఉండగా ప్రస్తుతం కేవలం 12 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, వారిలో ఏడుగురు మాత్రమే రెగ్యులర్ వైద్యులని తెలిపారు. 30 మంది స్టాఫ్ నర్సుల పోస్టులకు పది మంది మాత్రమే పనిచేస్తుండగా, పారిశుద్ధ్య సిబ్బంది కూడా తగినంతగా లేరని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల కారణంగా రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయలతో నిర్మించిన ఆసుపత్రిలో అవసరమైన వైద్యులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు మెరుగైన చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని విమర్శించారు. ఈ ఆసుపత్రికి పొరుగు ఆంధ్రప్రదేశ్‌తో పాటు అశ్వరావుపేట, దమ్మపేట, ములకలపల్లి, పెనుబల్లి, అన్నపురెడ్డిపల్లి, వేంసూరు మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తున్నందున, ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేసి అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిశీలనలో సీపీఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, డివిజన్ కమిటీ సభ్యులు రావుల రాజబాబు, సప్పిడి భాస్కర్, చావా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటం..!






- **రెండేళ్లుగా ఆగిన అండర్‌పాస్ పనులు..**
- **జాతీయ రహదారి -44 పై రోడ్డుపైనే బస్సు కోసం ప్రయాణికుల నిరీక్షణ**

**పెద్దమందడి,జులై12తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామం సమీపంలోని జాతీయ రహదారి-44 పై నిర్మించాల్సిన అండర్‌పాస్ బ్రిడ్జి పనులు రెండేళ్లుగా నిలిచిపోవడంతో ప్రజలు నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ రహదారిని తవ్వి కంకర వేసి అలాగే వదిలేయడంతో రహదారి ప్రమాదకరంగా మారింది.అండర్‌పాస్ నిర్మాణం పేరుతో జాతీయ రహదారి-44కు ఇరువైపులా తవ్వకాలు చేపట్టినా, పనులు మధ్యలోనే నిలిపివేయడంతో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేకుండా పోయాయి. బస్సు కోసం వేచి ఉండేందుకు బస్సు బే గానీ, షెల్టర్ గానీ లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, కళాశాల విద్యార్థులు జాతీయ రహదారి 44పై రోడ్డుపక్కనే గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. వేగంగా దూసుకెళ్లే వాహనాల మధ్య బస్సు ఎక్కడం, రోడ్డు దాటడం ప్రజలకు నిత్యకృత్యంగా మారింది.వెల్టూర్ గ్రామం వద్ద ఉన్న ఈ కూడలి దాదాపు 7 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన కేంద్రంగా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు ఎక్కే, దిగే ప్రయాణికులు రహదారిపైనే నిలబడాల్సి వస్తుండగా, భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రమాద భయం వెంటాడుతోంది.రెండేళ్లుగా పనులు పూర్తికాకపోవడంతో జాతీయ రహదారి-44లోని ఈ ప్రాంతంలో అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా జరిగాయని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్, జాతీయ రహదారుల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఈ సమస్యపై స్పందించకపోవడం ప్రజల్లో తీవ్ర అసహనానికి దారితీసింది. ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చిన నాయకులు, ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని జాతీయ రహదారి-44పై నిలిచిపోయిన అండర్‌పాస్ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు, బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులకు తాత్కాలిక బస్సు షెల్టర్లు, రక్షణ ఏర్పాట్లు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ఏడు గ్రామాల ప్రజల రాకపోకలకు కీలకమైన ఈ కేంద్రంలో శాశ్వత భద్రతా చర్యలు చేపట్టి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎస్ఐఆర్ సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- **సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్**



**పెద్దమందడి,జులై12(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామ పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ఓటు హక్కు ప్రాధాన్యతను గ్రామస్థులకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అర్హ ఓటరు ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా పూర్తి చేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. ఫారాలు ఎలా నింపాలో ప్రజలకు వివరించి, అవసరమైన వారికి స్వయంగా సహాయం అందించారు. గ్రామ యువకులు తమ కుటుంబ సభ్యులతో పాటు పరిసర ప్రాంతాల ఓటర్లను కూడా పాఠశాల ఆవరణకు తీసుకువచ్చి ఫారాలు పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఎస్. రాములు, పోతుల ప్రతాప్ రెడ్డి, జి. రామకృష్ణ రెడ్డి, ఎస్. వెంకటయ్య, జి. బాలరాజు, శ్రీకాంత్ రెడ్డి, బోయిన్ గణేష్, రవీందర్ రెడ్డి, కూపేంద్ర రెడ్డి, శేఖర్, బీఎల్‌ఓలు అరుణ, ప్రమీలమ్మ పాల్గొన్నారు.

# ఓటు హక్కు కోల్పోకుండా ఎస్ఐఆర్ పత్రాలు పూర్తి చేసుకోండి

- **కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, బాల్ రెడ్డి**



**పెద్దమందడి,జులై12(తెలంగాణ ముచ్చట్లు):**ఓటు హక్కు కోల్పోకుండా ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ పత్రాలను వెంటనే పూర్తి చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దమందడి మండలం అల్వాల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రత్యేక కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి. సుదర్శన్ రెడ్డి, జి. శేఖర్ రెడ్డి, బాల్ రెడ్డి పాల్గొని గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సకాలంలో నమోదు చేసి ఎస్ఐఆర్ పత్రాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల ఎవరూ ఆలస్యం చేయకుండా గడువు ముగిసేలోపు తప్పనిసరిగా ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శోభారాణి, బీఎల్‌ఓ రమాదేవి, ఫీల్డ్ అసిస్టెంట్ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఉమ్రా యాత్రను విజయవంతంగా ముగించుకుని క్షేమంగా తిరిగి రావాలి



- పెద్దమందడి సర్పంచ్ సూర్యగంగ రవి

**పెద్దమందడి ,జులై12(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన మొయినొద్దీన్ వారి సతీమణి పవిత్ర ఉమ్రా యాత్రకు బయలుదేరుతున్న సందర్భంగా పెద్దమందడి గ్రామ సర్పంచ్ సూర్యగంగ రవి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యగంగ రవి మాట్లాడుతూ..పవిత్రమైన ఉమ్రా యాత్రను ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తి చేసుకుని క్షేమంగా స్వగ్రామానికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. అల్లాహ్ కృపతో యాత్ర సాఫీగా సాగి, వారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ముస్లిం సోదరులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని ఉమ్రా యాత్రకు బయలుదేరుతున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఊరికి కీడు తొలగాలంటూ గ్రామం ఖాళీ...



- ఆబాది జమ్మికుంటలో సాంప్రదాయ ఆచారం

**జమ్మికుంట టౌన్ జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని 13, 14వ వార్డుల పరిధిలోని ఆబాది జమ్మికుంట గ్రామంలో గ్రామస్తులు సాంప్రదాయ ఆచారాలను పాటిస్తూ ఆదివారం "గ్రామం ఖాళీ" కార్యక్రమాన్ని నిర్వహించారు. గత కొంతకాలంగా గ్రామంలో పలువురు మరణించడంతో ఊరికి కీడు సోకిందని గ్రామ పెద్దలు భావించారు. దీంతో గ్రామ పెద్దల సమక్షంలో సమావేశమైన గ్రామస్తులు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామాన్ని పూర్తిగా ఖాళీ చేసి గ్రామ శివారులోనే గడపాలని నిర్ణయించారు. నిర్ణయం మేరకు కుటుంబాలన్నీ గ్రామం వెలుపలికి వెళ్లి అక్కడే వంటలు చేసుకుని భోజనం చేశారు. అనంతరం గ్రామ శ్రేయస్సు, ప్రజల ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఊరికి అపశకునం లేదా కీడు సోకిందని భావించిన సందర్భాల్లో గ్రామాన్ని ఖాళీ చేసి బయట వంటలు చేయడం, ప్రత్యేక పూజలు నిర్వహించడం అనేది తరతరాలుగా వస్తున్న సాంప్రదాయ ఆచారమని గ్రామ పెద్దలు తెలిపారు. ఇలా చేయడం వల్ల గ్రామంపై ఉన్న కీడు తొలగి శాంతి, సుభిక్షం నెలకొంటుందని స్థానికుల విశ్వాసం. గతంలోనూ ఇలాంటి పరిస్థితుల్లో ఇదే విధమైన ఆచారాన్ని నిర్వహించామని గ్రామస్తులు పేర్కొన్నారు.

# ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమంపై అమరజ్యోతి భవన్‌లో సమావేశం



**హైదరాబాద్,జూలై11(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లోని అమరజ్యోతి భవనంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై కే. కేశవరావు నాయకత్వంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి తెలంగాణ జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యునిగా మాజీ పార్లమెంట్ సభ్యుడు ఆచార్య అజ్మీర సీతారామ్ నాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉద్యమకారుల సేవలను సముచితంగా గుర్తించే విధానాలు, వారి సంక్షేమం కోసం చేపట్టాల్సిన చర్యలపై పలు విలువైన సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి గౌరవం, హక్కుల పరిరక్షణ రాష్ట్ర బాధ్యతగా భావించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# హుజురాబాద్‌లో భవన నిర్మాణ కార్మికుల జిల్లా సదస్సు

### జులై 20న కలెక్టరెట్ల ముట్టడి



**హుజురాబాద్, జూలై 12(తెలంగాణ ముచ్చట్లు ):** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 20న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద భారీ ర్యాలీలు, ధర్నాలు నిర్వహించనున్నట్లు బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములు తెలిపారు. హుజురాబాద్ పట్టణంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన నిర్వహించిన యూనియన్ జిల్లా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.
ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, అర్హులైన కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన అన్ని పథకాలను ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అనేక సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
కార్మికుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం జూలై 20న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే ర్యాలీలు, ధర్నాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని జయప్రదం చేయాలని కోరారు.
ఈ సదస్సులో యూనియన్ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.





# అభివృద్ధి కార్యక్రమాలతో బిజీబిజీగా గడిపిన చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని

**హుజురాబాద్, జూలై 12(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు ఆదివారం పలు అభివృద్ధి, శుభకార్యక్రమాల్లో పాల్గొని బిజీబిజీగా గడిపారు. ముందుగా హుజురాబాద్ మున్సిపాలిటీ 30వ వార్డుకు చెందిన శ్రావణి-చరణ్ రెడ్డి దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులను అభినందించారు. అనంతరం జమ్మికుంట మండలం శాయంపేట గ్రామంలో బోయిని సమ్మయ్య ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ పెట్రోల్ పంప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి పెట్రోల్ పంప్‌ను ప్రారంభించిన అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఖాసీం, ఆర్టీఐ కమిషనర్ భూపాల్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణతో అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. నూతనంగా ప్రారంభమైన భారత్ పెట్రోల్ పంప్ స్థానిక ప్రజలకు నాణ్యమైన ఇంధన సేవలను అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తుందని తెలిపారు. యాజమాన్యం పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.





# జమ్మికుంట ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారం


- ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్

**జమ్మికుంట టౌన్ జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇటీవల జరిగిన సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన నూతన అధ్యక్షుడు లెంక్కలపల్లి శరత్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ వ్యాపార రంగం, ఆర్థికాభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. పట్టణంలో చేపట్టే సామాజిక, సేవా కార్యక్రమాల్లోనూ ఆర్యవైశ్యులు ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. ప్రజా సేవలో మున్సిపల్ పాలకవర్గానికి ఆర్యవైశ్య సంఘం సహాయ సహకారాలు మరింతగా అందించాలని కోరారు. అలాగే ఆర్యవైశ్య సంఘం చేపట్టే ప్రతి అభివృద్ధి, సేవా కార్యక్రమానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. నూతన కమిటీ సమర్థవంతంగా పనిచేసి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ, వాసవి మాత ఆశీస్సులు సంఘ సభ్యులందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చందా రాజు, బచ్చు మాధవి-శివశంకర్, బచ్చు భాస్కర్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ప్రముఖులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రాణాపాయంలో గురుపత్ని...

- దాతలూ... ఒక్క రూపాయి అయినా సరే, ఓ నిండు జీవితాన్ని నిలబెట్టండి!
- బ్రెయిన్ స్ట్రోక్‌తో హైదరాబాద్ యశోదలో పోరాటం..
- వారానికి 2.20 లక్షల ఇంజెక్షన్..
- 18 వారాల పాటు చికిత్స
- చేతులెత్తి వేడుకుంటున్న హిందీ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కుటుంబం!

**ఖమ్మం బ్యూరో, జూలై 12(తెలంగాణ ముచ్చట్లు ):** అక్షరాలు నేర్పి ఎందరో భవితను తీర్చిదిద్దే ఒక గురువు..నేడు తన భార్య ప్రాణాలను కాపాడుకోవడానికి సమాజం వైపు దీనంగా చేతులెత్తి వేడుకుంటున్నారు. కాలం విసిరిన విధి వంచనకు ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. తన అర్ధాంగిని బతికించుకోవడానికి ఆ ఉపాధ్యాయుడు పడుతున్న ఆరాటం, కన్నీటి వేడుకోలు ప్రతి ఒక్కరి హృదయాన్ని ద్రవింపజేస్తోంది.
ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం నాచేపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గద్దపాటి శ్రీనివాస్ సతీమణి హఠాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో మరణంతో పోరాడుతున్నారు.
ఆమె ప్రాణాలు నిలవాలంటే అత్యంత ఖరీదైన వైద్యం అవసరమని వైద్యులు స్పష్టం చేశారు. ప్రతి వారం సుమారు రూ. 2,20,000/ (రెండు లక్షల ఇరవై వేల రూపాయలు) విలువైన ఇంజెక్షన్‌ను, వరుసగా 18 వారాల పాటు ఇవ్వాల్సి ఉందని వైద్యులు తెలిపారు. అంటే కేవలం ఇంజెక్షన్ల కోసమే దాదాపు 40 లక్షల రూపాయల వరకు ఖర్చవుతోంది. ఒక సాధారణ ప్రభుత్వ ఉపాధ్యాయుడైన శ్రీనివాస్, తన సతీమణి ప్రాణాలను దక్కించుకోవడానికి తన శాయశక్తులా ప్రయత్నించారు. ఉన్నదంతా ధారపోశారు. కానీ, ఊహించని విధంగా వచ్చిపడిన ఈ భారీ వైద్య ఖర్చులను భరించడం ఆయన శాతానికి మించిపోయింది. చికిత్స మధ్యలో ఆగిపోతే ఏమవుతుందోనన్న భయం ఆ కుటుంబాన్ని వెంటాడుతోంది.



మీరు ఇచ్చే ప్రతి రూపాయి.. ఒక నిండు ప్రాణానికి సంజీవని! "నా శాయశక్తులా ప్రయత్నించాను.. కానీ ఈ ఖర్చు నా శక్తికి మించింది. నా భార్యను కాపాడుకోవడానికి దాతల ఆర్థిక సాయమే శరణ్యం. ఈ క్లిష్ట సమయంలో మా కుటుంబానికి అండగా నిలిచి, చేతనైన మేరకు సహాయం అందించి నా భార్యకు పునర్జన్మ ప్రసాదించండి" అని ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కన్నీటి పర్యంతమవుతూ వేడుకుంటున్నారు. మనుషుల మధ్య దూరం పెరిగినా, మానవత్వం ఇంకా చావలేదని నిరూపించాల్సిన సమయం ఇది. మీరు అందించే సహాయం చిన్నదా, పెద్దదా అన్నది ముఖ్యం కాదు.. మీ మంచి మనసుతో ఇచ్చే ప్రతి వంద రూపాయిలు కూడా ఆ కుటుంబానికి కొండంత అండగా మారుతాయి. ఒక నిండు జీవితాన్ని కాపాడటానికి, ఒక గురువు సంసారాన్ని నిలబెట్టడానికి ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించాలని శ్రీనివాస్ స్నేహితులు, సహచర ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.
సహాయం చేయదలచిన వారు క్రింది నెంబర్‌కు గూగుల్ పే లేదా ఫోన్ పే చేయగలరు : ఫోన్ పే / గూగుల్ పే / యుపిఐ నెంబర్: 99516 60789
పేరు : గద్దపాటి శ్రీనివాస్
రాబోయే రోజుల్లో ఆ కుటుంబం మళ్లీ నవ్వుతూ కనిపించాలంటే అది మన చేతుల్లోనే ఉంది. దాతలు పెద్ద మనసుతో స్పందించి ఆదుకోవాలని ఆశిస్తున్నాం.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
సోమవారం - 13 - జూలై 2026





# కాంగ్రెస్ మెడలు వంచి ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేయించుకోవాలి

- **ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదలకు రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు**

**హనుమకొండ,జులై12(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.11,300 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండలోని హరిత హోటల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు హాజరయ్యారు.సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థను కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలు కలిసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై పలు విమర్శలు, ఆరోపణలు చేశారు.

ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్మెంట్ సమస్య విద్యార్థులు, కళాశాలలకే పరిమితం కాకుండా సామాజిక సమస్యగా మారిందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్యకు ఈ పథకం కీలకమని పేర్కొన్నారు. ఆగస్టు 15 వరకు ప్రభుత్వం బకాయిలు విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు.ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని కోరారు.

జన్ను జకారియా మాట్లాడుతూ, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఒకే వేదికపైకి రావడం స్వాగతించదగ్గ పరిణామమన్నారు. మంద కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రయోజనాల కోసం చేపట్టే ఉద్యమాలకు తమ సంఘం మద్దతు ఉంటుందని తెలిపారు.

వామపక్ష పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సుధీర్ కుమార్, జన్ను జకారియా, మంద కుమార్ మాదిగ, తిర్నారి శేషు, రాజమౌళి, చుక్కయ్య, హంసారెడ్డి, ఎలకంటి రాజేందర్, మైస ఉపేందర్, సుకుమార్, శ్రీనివాస్‌తో పాటు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.








# గ్రామీణాభివృద్ధికి కొత్త బాట.. శాయంపేటలో భారత్ పెట్రోల్ పంపు ప్రారంభం

**జమ్మికుంట టౌన్ జులై 12 (తెలంగాణ ముచ్చట్లు) :** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం శాయంపేట గ్రామంలో బోయిని సమ్మయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన భారత్ పెట్రోల్ పంపును ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ ఖాసీం, ఆర్టీఐ కమిషనర్ భూపాల్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, మనోజ్ రావు ముఖ్య అతిథులుగా హాజరై పెట్రోల్ పంపును ప్రారంభించి నిర్వాహకుడు బోయిని సమ్మయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక ఇంధన సేవలు అందించే కేంద్రాలు ఏర్పడడం అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి పెట్రోల్ పంపుల ద్వారా స్థానిక ప్రజలకు నాణ్యమైన సేవలు సులభంగా అందుబాటులోకి రావడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అన్నారు. వ్యాపార రంగంలో విజయవంతంగా ముందుకు సాగుతున్న బోయిని సమ్మయ్య మరిన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి, గ్రామ అభివృద్ధికి తనవంతు సహకారం అందించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, వ్యాపారవేత్తలు, అభిమానులు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పెట్రోల్ పంపు ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# కలెక్టరేట్ ఎదుట నేడు టీడబ్ల్యూజేఎఫ్ నిరసన

- **అర్హులైన జర్నలిస్టులకు సరిపడా అక్రిడిటేషన్ లు ఇవ్వాలి**
- **ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, సమస్యలన్నీ పరిష్కరించాలి**
- **జర్నలిస్టులు భారీగా తరలిరండి**
- **జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం బ్యూరో , జూలై 12(తెలంగాణ ముచ్చట్లు ):** వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (హెచ్ 2843) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం చేపట్టే నిరసనను విజయవంతం చేయాల్సిందిగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన జర్నలిస్టులకు సరిపడా అక్రిడిటేషన్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొద్దిమందికి మాత్రమే అక్రిడిటేషన్ ల జారీ సరికాదని తెలిపారు. జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సు పాసులతో పాటు కొత్త మెట్రో పాసులను ఉచితంగా జారీచేయాలని కోరారు. ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఇతర సమస్యలన్నీ పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈనెల 4న రాష్ట్ర కార్యవర్గ సమావేశం చేసిన తీర్మానాలకు అనుగుణంగా జూలై 13న సోమవారం ఉదయం 11 గంటల నుంచి కలెక్టరేట్ వద్ద నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంతో పాటు మండలాల నుంచి కూడా పెద్ద ఎత్తున జర్నలిస్టులు తరలాల్సిందిగా కోరారు.

# తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ గౌరవ సలహాదారునిగా అమర్ సింగ్ తిలావత్ నియామకం

**హైదరాబాద్,జూలై 11(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) రాష్ట్ర కమిటీ, వ్యవస్థాపక అధ్యక్షుడు మూడవత్ అశోక్ నాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్‌ను టీఎస్ఎఫ్ గౌరవ సలహాదారునిగా ఏకగ్రీవంగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రామావత్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. అనంతరం టీఎస్ఎఫ్ నాయకులు అమర్ సింగ్ తిలావత్‌ను కలిసి నియామక పత్రాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. విద్యా రంగం, సామాజిక రంగాల్లో ఆయనకు ఉన్న అనుభవం సంస్థ కార్యకలాపాలకు దోహదపడుతుందని నాయకులు పేర్కొన్నారు.విద్యార్థుల హక్కుల పరిరక్షణ, నాణ్యమైన విద్య అందరికీ అందేలా కృషి చేయడం, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టీఎస్ఎఫ్ చేపట్టే కార్యక్రమాలకు ఆయన మార్గదర్శకత్వం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కొర్ర లక్షపతి నాయక్, టీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు భట్టు వెంకన్న, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ దృక్పథంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం

**ధర్మసాగర్‌లో జన విజ్ఞాన వేదిక మండల మహాసభ**

**ఎన్ఐటీ ప్రొఫెసర్ వి. రామ**

**ధర్మసాగర్,జూలై12(తెలంగాణ ముచ్చట్లు):** జన విజ్ఞాన వేదిక ధర్మసాగర్ మండల మహాసభ ఆదివారం ముప్పారంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రధానోపాధ్యాయురాలు మాధవి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సమగ్ర శిక్ష హనుమకొండ జిల్లా సెక్టోరియల్ అధికారి సునీత మాట్లాడుతూ, మానవజాతి ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధ ఆలోచన, విజ్ఞానపూర్వక కార్యాచరణ ద్వారానే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. విద్యార్థులు, యువత ప్రశ్నించే స్వభావాన్ని అలవర్చుకొని మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు.






ప్రధాన వక్తగా పాల్గొన్న ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ వి. రామ “శాస్త్ర సాంకేతికత - గతం, వర్తమానం, భవిష్యత్తు” అంశంపై ప్రసంగిస్తూ, శాస్త్ర సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ సమాజంలో మూఢనమ్మకాలు పెరుగుతుండడం ఆందోళనకరమన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో విస్తృతంగా వ్యాప్తి చేయడం ద్వారా మాత్రమే శాస్త్ర విజ్ఞాన ఫలాలు అందరికీ చేరుతాయని, శాస్త్రీయ సమాజ నిర్మాణంతోనే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

విశ్రాంత జిల్లా అటవీ అధికారి పురుషోత్తం మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సహజ వనరులను కాపాడుతూ భావితరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం జరిగిన ప్రతినిధుల సమావేశంలో గత రెండేళ్ల కార్యకలాపాల నివేదికను సురేష్ సమర్పించారు. ఎన్నికల పరిశీలకుడిగా కె.బి. ధర్మ ప్రకాశ్ వ్యవహరించగా, నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సురేష్ అధ్యక్షుడిగా, రామకృష్ణ కార్యదర్శిగా, కిరణ్ కోశాధికారిగా, సుధీర్, మాధవి తదితరులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.నూతన కమిటీ శాస్త్రీయ దృక్పథ వికాసం, పర్యావరణ పరిరక్షణ, మూఢనమ్మకాల నిర్మూలన, రాజ్యాంగ విలువల ప్రచారం, విజ్ఞాన వ్యాప్తి కార్యక్రమాలను గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపింది.ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- **1 నుంచి 19 ఏళ్లలోపు ప్రతి చిన్నారి ఆల్బెండజోల్ మాత్ర తీసుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**హనుమకొండ,జూలై12(తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జూలై 13న జిల్లావ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా వైద్య, విద్య, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి అవసరమైన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మొత్తం 2,08,441 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 1 నుంచి 2 సంవత్సరాల పిల్లలకు అర మాత్ర, 2 నుంచి 19 సంవత్సరాల వారికి పూర్తి మాత్ర అందజేస్తామని తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు సురక్షితమైనవని, ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని స్పష్టం చేశారు.నులి పురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, మలబద్ధకం, వాంతులు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అలాగే చదువుపై ఏకాగ్రత తగ్గడం, తరచూ అనారోగ్యానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. నులి పురుగుల నివారణకు భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి వినియోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, ఎల్లప్పుడూ చెప్పులు ధరించడం, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను శుభ్రంగా కడిగి వినియోగించడం, పరిశుభ్రమైన ఆహారం, సురక్షితమైన తాగునీరు తీసుకోవడం, బహిరంగ మలవిసర్జనకు దూరంగా ఉండడం వంటి పరిశుభ్రత అలవాట్లు పాటించాలని సూచించారు.

జిల్లాలోని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారి ఆల్బెండజోల్ మాత్రను తప్పనిసరిగా తీసుకునేలా తల్లిదండ్రులు సహకరించి జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# ప్రతిభావంతులకు స్వర్ణ నంది – కీర్తి చక్ర పురస్కారాలు

- **అన్ని రంగాల వారి ప్రతిభను గుర్తించి సత్కరించడమే లక్ష్యం**
- **నిర్వాహకురాలు శిరీష రెడ్డి**

**హైదరాబాద్,జులై12(తెలంగాణ ముచ్చట్లు):** మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న స్వర్ణ నంది - కీర్తి చక్ర పురస్కారాలు-2026 కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని నిర్వాహకురాలు శిరీష రెడ్డి తెలిపారు.సమాజంలోని వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పురస్కారాలను అందజేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు, రాజకీయ, సినీ, టెలివిజన్ రంగాలకు చెందిన ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పురస్కార గ్రహీతలకు అవార్డు, మెడల్, ప్రశంసాపత్రంతో పాటు ఘన సన్మానం నిర్వహించనున్నామని వెల్లడించారు.

కళాకారులు, సినీ ప్రముఖులు, దర్శకులు, నిర్మాతలు, వైద్యులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, సామాజిక సేవకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు, యూట్యూబర్లు, రచయితలు, గాయకులు, రైతులు, పురోహితులు, యోగా గురువులు, కోచింగ్ మాస్టర్లు, ఫ్యాషన్, బ్యూటీ, హోటల్, బ్యాంకింగ్, ఈవెంట్స్ తదితర అన్ని రంగాలకు చెందిన ప్రతిభావంతులు ఈ పురస్కారాలకు అర్హులని శిరీష రెడ్డి తెలిపారు.పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు లేదా కార్యక్రమంలో పాల్గొనాలనుకునే ఆసక్తి గల వారు 90144 84952 నంబర్‌ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆమె కోరారు.






# గానకోకిలకు కన్నీటి వీడ్కోలు

- **ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు**
- **మైసూరులో తుది వీడ్కోలు**
- **వేలాదిగా తరలివచ్చిన అభిమానులు**
- **మనవరాలు అప్సర చేతుల మీదుగా అంతిమ సంస్కారాలు**

**మైసూరు, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ నేపథ్య గాయని, గానకోకిల ఎస్. జానకికి ఆదివారం మైసూరులో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సంగీత ప్రపంచానికి చిరస్మరణీయ సేవలు అందించిన ఆమెకు వేలాది మంది అభిమానులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, కళాకారులు అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు. కర్ణాటక ప్రభుత్వం పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి గౌరవం తెలిపింది. అంత్యక్రియలకు ముందు జానకమ్మ భౌతికకాయాన్ని మైసూరులోని మహారాజా కళాశాల మైదానంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. తెల్లవారుజాము నుంచే అభిమానులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకుని తమ అభిమాన గాయనికి నివాళులర్పించారు. సినీ, రాజకీయ, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు పుష్పాంజలి ఘటించి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రజల సందర్శనం అనంతరం ఎస్. జానకి భౌతికకాయాన్ని ఆమె చివరి కోరిక మేరకు మైసూరు సమీపంలోని కణియనహుండి గ్రామంలో ఉన్న ఆమె వ్యవసాయ క్షేత్రానికి తరలించారు. అక్కడ ప్రభుత్వ లాంఛనాల మధ్య పోలీసుల గౌరవ వందనంతో అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితులు భావోద్వేగ వాతావరణంలో ఆమెకు తుది వీడ్కోలు పలికారు. ఎస్. జానకి మనవరాలు అప్సర అంతిమ సంస్కారాలను నిర్వహించారు. కుటుంబ సభ్యులు, అభిమానుల రోదనల మధ్య అంత్యక్రియలు ముగిశాయి. దాదాపు సాయంత్రం 5.40 గంటల సమయంలో అంత్యక్రియలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన సంగీత ప్రస్థానంలో ఎస్. జానకి 20కిపైగా భారతీయ భాషల్లో 48 వేలకుపైగా పాటలు ఆలపించి సంగీత ప్రపంచంలో చెరగని ముద్ర వేశారు. నాలుగు జాతీయ చలన చిత్ర పురస్కారాలతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్న ఆమె, తన మధుర గానంతో కోట్లాది మంది సంగీతాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆమె మరణంతో భారతీయ సినీ సంగీత రంగం ఓ మహోన్నత గాన గంధర్విని కోల్పోయిందని ప్రముఖులు నివాళులర్పించారు.

# విద్యలో మాతృభాష ప్రాధాన్యం... నేటి అవసరమా?

**డెస్క్, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):** విద్య అనేది కేవలం అక్షరజ్ఞానం సంపాదించే ప్రక్రియ మాత్రమే కాదు. ఆలోచనలను విస్తరించడం, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడం, సమాజాన్ని అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడం కూడా విద్య లక్ష్యమే. ఈ ప్రయాణంలో విద్యార్థి మొదట నేర్చుకునే భాష అతని మాతృభాష. చిన్ననాటి నుంచి ఇంట్లో, కుటుంబంలో, సమాజంలో వినే భాషలోనే పిల్లల ఆలోచనలు రూపుదిద్దుకుంటాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా విద్యావేత్తలు ప్రాథమిక విద్య మాతృభాషలో ఉంటే పిల్లల మేధో వికాసం మరింత మెరుగ్గా ఉంటుందని సూచిస్తున్నారు. ఆధునిక సాంకేతిక యుగంలోనూ ఈ అంశం ప్రాధాన్యాన్ని కోల్పోలేదు. ప్రస్తుతం చాలా మంది తల్లిదండ్రులు ఆంగ్ల మాధ్యమ విద్యనే విజయానికి ఏకైక మార్గంగా భావిస్తున్నారు. చిన్నారులు తమ మాతృభాషలో పూర్తిగా మాట్లాడకముందే ఇతర భాషలను నేర్పించే ప్రయత్నం జరుగుతోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో విదేశీ భాషల ప్రాధాన్యం పెరగడం సహజమే అయినప్పటికీ, మాతృభాషను పూర్తిగా విస్మరించడం మాత్రం సరైన దిశ కాదు. భాష అనేది కేవలం సంభాషణ సాధనం మాత్రమే కాదు. అది ఒక జాతి సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, విలువలను మోసుకెళ్లే వారసత్వం. విద్యా పరిశోధనలు కూడా మాతృభాషలో అభ్యాసం చేసే విద్యార్థులు పాఠాలను త్వరగా అర్థం చేసుకుంటారని స్పష్టం చేస్తున్నాయి. గణితం, విజ్ఞానం, సామాజిక శాస్త్రం వంటి క్లిష్టమైన అంశాలను కూడా తమకు తెలిసిన భాషలో నేర్చుకున్నప్పుడు పిల్లలు సులభంగా గ్రహించగలుగుతారు. సందేహాలను నిర్భయంగా అడగగలుగుతారు. సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం కూడా పెరుగుతుంది. తెలియని భాషలో నేర్చుకోవడానికి ఎక్కువ సమయం వెచ్చించాల్సి రావడం వల్ల అసలు విషయాన్ని అర్థం చేసుకోవడంలో కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురవుతాయి. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలు తమ మాతృభాషలలోనే విద్యను అందిస్తున్నాయి. జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఫ్రాన్స్, చైనా వంటి దేశాల్లో పాఠశాల విద్య ప్రధానంగా ఆయా దేశాల భాషల్లోనే సాగుతుంది. అదే సమయంలో అంతర్జాతీయ అవసరాల కోసం ఆంగ్లం వంటి ఇతర భాషలను కూడా బోధిస్తున్నారు.



ఈ విధానం వల్ల విద్యార్థులు తమ సంస్కృతిని కాపాడుకుంటూనే ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ఇది భారతదేశానికి కూడా ఆదర్శంగా నిలవగల నమూనా. భారతదేశం భాషా వైవిధ్యానికి నిలయంగా గుర్తింపు పొందింది. వందలాది భాషలు, మాండలికాలు ఇక్కడ జీవిస్తున్నాయి. ఈ భాషలు కేవలం సంభాషణ సాధనాలు మాత్రమే కాదు, వేల ఏళ్ల సాహిత్యం, జ్ఞానం, సంస్కృతికి నిలయాలు కూడా. మాతృభాషలో విద్య అందించడం ద్వారా ఈ వారసత్వాన్ని భావితరాలకు చేరవేయవచ్చు. ఒక భాష బలంగా ఉంటే ఆ భాషతోముడిపడిన సంస్కృతి కూడా బలంగా నిలుస్తుంది. జాతీయ విద్యా విధానం-2020 కూడా ప్రాథమిక తరగతుల్లో మాతృభాష లేదా స్థానిక భాషలో బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. చిన్నారుల అభ్యాస సామర్థ్యాన్ని పెంచేందుకు ఇది ఉపయుక్తమని నిపుణులు పేర్కొన్నారు. అయితే దీనిని విజయవంతంగా అమలు చేయాలంటే నాణ్యమైన పాఠ్యపుస్తకాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, ఆధునిక బోధనా పద్ధతులు అందుబాటులో ఉండాలి. కేవలం విధానాలు ప్రకటించడం సరిపోదు; వాటిని సమర్థంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యం.

అయితే మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వడం అంటే ఇతర భాషలను వ్యతిరేకించడం కాదు. నేటి ప్రపంచంలో ఆంగ్లంతో పాటు ఇతర విదేశీ భాషల పరిజ్ఞానం కూడా ఉపాధి, ఉన్నత విద్య, అంతర్జాతీయ అవకాశాలకు ఉపయోగపడుతుంది. అందువల్ల విద్యార్థులు మాతృభాషలో బలమైన పునాది వేసుకొని, ఆపై ఇతర భాషల్లో కూడా నైపుణ్యం సాధించే విధంగా విద్యా వ్యవస్థ రూపుదిద్దుకోవాలి. ఇదే సమతుల్య దృక్పథం. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న ఈ కాలంలో మాతృభాషల అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయి. కృత్రిమ మేధ, డిజిటల్ పాఠ్యవస్తువులు, అనువాద సాంకేతికత, ఆన్‌లైన్ విద్యా వేదికలు ప్రాంతీయ భాషల్లో నాణ్యమైన విద్యను అందించగలుగుతున్నాయి. ఈ అవకాశాలను సమర్థంగా వినియోగిస్తే గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య విద్యా అంతరాన్ని కూడా తగ్గించవచ్చు.

మాతృభాషలో విద్య బలపడాలంటే ప్రభుత్వంతో పాటు కుటుంబాల పాత్ర కూడా కీలకం. ఇంట్లో పిల్లలతో మాతృభాషలో మాట్లాడడం, మంచి పుస్తకాలు చదివించడం, కథలు చెప్పడం, స్థానిక సాహిత్యాన్ని పరిచయం చేయడం ద్వారా భాషపై ప్రేమ పెంపొందించవచ్చు. పాఠశాలలు కూడా భాషా దినోత్సవాలు, సాహిత్య కార్యక్రమాలు, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో భాషాపట్ల గౌరవాన్ని పెంచాలి. ప్రపంచీకరణ యుగంలో అనేక భాషలు కనుమరుగయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఒక భాష అంతరించిపోతే దానితో పాటు ఆ భాషలోని చరిత్ర, జ్ఞానం, సంస్కృతి కూడా కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందుకే మాతృభాషను కాపాడుకోవడం అనేది కేవలం భావోద్వేగ అంశం కాదు; అది సాంస్కృతిక బాధ్యత కూడా. విద్యా వ్యవస్థలో మాతృభాషకు తగిన స్థానం కల్పించడం ద్వారా భావితరాలకు మన భాషా సంపదను అందించవచ్చు.

అంతిమంగా, మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలా లేదా అనే ప్రశ్నకు సమాధానం స్పష్టంగానే కనిపిస్తుంది. ప్రపంచ భాషలను నేర్చుకోవడం అవసరమే, కానీ మాతృభాషను మరచిపోవడం మాత్రం సమంజసం కాదు. మాతృభాషలో బలమైన పునాది, ఇతర భాషల్లో విస్తృత పరిజ్ఞానం ఈ రెండింటి సమన్వయమే విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధికి, దేశ ప్రగతికి, జ్ఞాన సమాజ నిర్మాణానికి ఉత్తమ మార్గం. విద్యలో మాతృభాషకు గౌరవం ఇవ్వడం అంటే మన మూలాలను బలోపేతం చేయడమే. అదే భావితరాల విజయానికి నిజమైన పునాది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ముఖ్యమంత్రిని కలిసిన బీబీసీ ప్రతినిధులు

- **మహిళల క్రీడలపై అధ్యయన గ్రంథం అందజేత**
- **క్రీడాభివృద్ధి చర్యలను వివరించిన రేవంత్ రెడ్డి**
- **జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులకు ప్రోత్సాహం**

**హైదరాబాద్, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీబీసీ భారతీయ భాషల విభాగం ప్రచురణ సంస్థ కలెక్టివ్ న్యూస్‌రూమ్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి రూపా ఝా, బీబీసీ న్యూస్ తెలుగు సంపాదకుడు జి.ఎస్. రామ్మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహిళల క్రీడలు, క్రీడాకారిణులు, భారతీయ సమాజంలో మహిళలపై ప్రజల అభిప్రాయాలకు సంబంధించిన అధ్యయన గ్రంథాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. కలెక్టివ్ న్యూస్‌రూమ్ నిర్వహించిన సర్వే ఆధారంగా రూపొందించిన ఈ గ్రంథంలోని ముఖ్యాంశాలను ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. మహిళల క్రీడల పట్ల సమాజంలో ఉన్న అవగాహన, ప్రోత్సాహం, సవాళ్లకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ, ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు రాణించేలా ప్రభుత్వం పలు ప్రోత్సాహక పథకాలు అమలు చేస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా క్రీడాకారిణులకు అవసరమైన అన్ని విధాల సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ భేటీలో మహిళల క్రీడల ప్రోత్సాహం, క్రీడా రంగ అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్రంలో క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించే అంశాలపై కూడా చర్చించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది.



# నాగార్జున యాదవ్ అరెస్ట్

- **రేవంత్‌పై వ్యాఖ్యల కేసులో చర్య**
- **గుంటూరులో అదుపులోకి తీసుకున్న తెలంగాణ పోలీసులు**
- **దర్యాప్తు కోసం హైదరాబాద్‌కు తరలింపు**

**గుంటూరు, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్‌ను తెలంగాణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. గుంటూరు జిల్లాలోని ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. పోలీసుల వివరాల ప్రకారం, ఇటీవల ఓ టెలివిజన్ చర్చా కార్యక్రమంలో నాగార్జున యాదవ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై ఫిర్యాదు నమోదైంది. ముఖ్యమంత్రిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో కేసు నమోదు చేసి తెలంగాణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

దర్యాప్తులో భాగంగా తెలంగాణ పోలీసుల బృందం ఆదివారం గుంటూరుకు చేరుకుని నాగార్జున యాదవ్ నివాసంలో ఆయనను అదుపులోకి తీసుకుంది. అరెస్టు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసిన అనంతరం స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చి, తదుపరి విచారణ కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. ఒక రాష్ట్రానికి చెందిన రాజకీయ పార్టీ నేతను మరో రాష్ట్ర పోలీసులు వచ్చి అరెస్టు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ పరిణామంపై అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేసుకు సంబంధించిన తదుపరి విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, నాగార్జున యాదవ్ చేసిన వ్యాఖ్యల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వివాదం నెలకొంది. ఆ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయగా, ఆ ఫిర్యాదు ఆధారంగా తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు సమాచారం.

# రూ.76 కోట్లతో రైల్వే వంతెనకు శంకుస్థాపన

- **నకిరేకల్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం**
- **ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయన్న మంత్రి**
- **సేతు బంధన్ పథకానికి కేంద్రానికి కృతజ్ఞతలు**

**నల్గొండ, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):**
నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలోని నార్కట్‌పల్లి-మునుగోడు రహదారిపై రూ.76 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రైల్వే పైవంతెనకు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ వంతెన నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సేతు బంధన్ (సీఆర్ఐఎఫ్) పథకం కింద తెలంగాణకు తొలిసారిగా రూ.103 కోట్ల నిధులు మంజూరు చేయడం సంతోషకరమని అన్నారు. ఇందులో నకిరేకల్ రైల్వే పైవంతెన నిర్మాణానికి రూ.76 కోట్ల నిధులు కేటాయించడం అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసిన కేంద్ర రహదారుల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు వేగంగా అమలవుతున్నాయని చెప్పారు.

రైల్వే గేటు వద్ద తరచూ ఏర్పడే ట్రాఫిక్ సమస్యలకు ఈ వంతెనతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి తెలిపారు. రహదారి భద్రత మెరుగుపడటంతో పాటు ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. వంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత నకిరేకల్, నార్కట్‌పల్లి, మునుగోడు ప్రాంతాల మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



# జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయానికి భూమిపూజ

- **ఐదు ఎకరాల్లో శాశ్వత భవన నిర్మాణం**
- **విద్యాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం**
- **త్వరలో తాత్కాలిక భవనంలో తరగతుల ప్రారంభం**

**జగిత్యాల, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):**
జగిత్యాల జిల్లా కేంద్రంలోని చలగల్ వాలంతరీ వ్యవసాయ క్షేత్రంలో కేంద్రీయ విద్యాలయ శాశ్వత భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కరీంనగర్ లోక్‌సభ సభ్యుడు ధర్మపురి అరవింద్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కేంద్రీయ విద్యాలయ నిర్మాణం కోసం ఐదు ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని పేర్కొన్నారు.




లోక్‌సభ సభ్యుడు ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలు నాణ్యమైన విద్యకు చిరునామాగా నిలిచాయని అన్నారు. జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో జిల్లాకు చెందిన విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక భవనంలో త్వరలోనే తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయాన్ని తీసుకురావడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సమిష్టి కృషి ఫలించిందని ఎంపీ పేర్కొన్నారు. ఈ విద్యాలయం ద్వారా జిల్లాలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని, విద్యార్థులు జాతీయ స్థాయి విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కేంద్రీయ విద్యాలయ నిర్మాణాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

# చిల్లర కష్టాలు.. మంత్రికే తప్పలేదు

- **మారు వేషంలో బస్సు తనిఖీ**
- **రూ.100 నోటుతో మొదలైన వివాదం**
- **చిల్లర లేదంటూ బస్సు దిగాలన్న కండక్టర్**
- **ప్రయాణికుల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకున్న మంత్రి**



**బెంగళూరు, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):**
నగర బస్సు ప్రయాణికులు నిత్యం ఎదుర్కొనే ఇబ్బందులు ఎలా ఉంటాయో స్వయంగా తెలుసుకునేందుకు కర్ణాటక రవాణా శాఖ మంత్రి బైరతి సురేష్ మారు వేషంలో బీఎంటీసీ బస్సుల్లో ప్రయాణించారు. మాస్క్ ధరించి సాధారణ ప్రయాణికుడిలా బస్సు ఎక్కిన ఆయనకు ఊహించని అనుభవం ఎదురైంది. చిల్లర ఇవ్వలేకపోవడంతో బస్సు దిగిపోవాలని కండక్టర్ చెప్పడంతో మంత్రి సైతం సాధారణ ప్రయాణికుడిలాగే ఇబ్బంది ఎదుర్కొన్నారు. శనివారం రాత్రి ప్రత్యేక తనిఖీల్లో భాగంగా మంత్రి హెబ్బాళ్ నుంచి నాగశెట్టిహళ్లి వెళ్లే బీఎంటీసీ బస్సు ఎక్కారు. రాత్రి 7:10 గంటల నుంచి 9:10 గంటల వరకు జయమహల్, టీవీ టవర్, ఆర్‌టీనగర్, సీబీఐ రోడ్, హెబ్బాళ్, మాన్యతా టెక్ పార్క్, నాగవార, హెన్నూర్, హెన్నూర్ బండే, బైరతి బండే, గెద్దలహళ్లి ప్రాంతాల మీదుగా నడిచే పలు బస్సుల్లో ప్రయాణిస్తూ సేవల తీరును పరిశీలించారు. ఈ మొత్తం సమయంలో మంత్రి తన అసలు గుర్తింపును ఎక్కడా బయటపెట్టలేదు.


ఒక బస్సులో రెండు టిక్కెట్లు కావాలని కోరుతూ మంత్రి రూ.100 నోటు కండక్టర్‌కు ఇచ్చారు. అయితే చిల్లర ఇవ్వాలని కండక్టర్ అడగగా, తన వద్ద లేదని మంత్రి సమాధానమిచ్చారు. దీంతో తన వద్ద కూడా చిల్లర లేదని చెబుతూ కండక్టర్ తన నగదు సంచిని తెరిచి చూపించాడు. చిల్లర లేకుంటే టిక్కెట్లు ఇవ్వలేనని, బస్సు నుంచి దిగిపోవాల్సిందేనని స్పష్టం చేశాడు. కండక్టర్ తనను గుర్తించలేదని తెలిసినా మంత్రి ఎలాంటి వాగ్వాదానికి దిగకుండా ప్రశాంతంగా బస్సు దిగిపోయారు. ప్రయాణికులు ప్రతిరోజూ ఎదుర్కొనే సమస్యలను ప్రత్యక్షంగా అనుభవించాలన్న ఉద్దేశంతోనే ఆయన ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో కండక్టర్ విధి నిర్వహణలో రాజీ పడకుండా వ్యవహరించడం కూడా చర్చనీయాంశమైంది.

తర్వాత ఈ ఘటనకు సంబంధించిన వివరాలు బయటకు రావడంతో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చ సాగింది. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు మంత్రి మారు వేషంలో బస్సుల్లో ప్రయాణించడం అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు. మరోవైపు చిల్లర సమస్య ఇప్పటికీ ప్రజా రవాణాలో పెద్ద ఇబ్బందిగానే కొనసాగుతోందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. బీఎంటీసీ సేవల్లో టిక్కెట్ జారీ విధానం, చిల్లర సమస్య, ప్రయాణికులకు ఎదురవుతున్న ఇబ్బందులు, సిబ్బంది వ్యవహారశైలిపై మంత్రి ప్రత్యక్షంగా సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి, ప్రజా రవాణా సేవలను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని కర్ణాటక ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# నీళ్ల సీసాలో యాసిడ్.. మహిళకు తీవ్ర అస్వస్థత

- **నగల దుకాణంలో దాహం తీర్చుకోబోయి విషాదం**
- **బాటిల్ విక్రయించిన దుకాణ యజమాని అదుపులో**
- **సీసీటీవీ దృశ్యాల ఆధారంగా దర్యాప్తు**

**లక్నో, జూలై 12 (తెలంగాణ ముచ్చట్లు):**
ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్‌లో కలకలం రేపిన ఘటన చోటుచేసుకుంది. నగల దుకాణానికి వచ్చిన ఓ మహిళకు తాగేందుకు ఇచ్చిన నీటి సీసాలో యాసిడ్ ఉండటంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. ప్రస్తుతం బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, జూలై 10 సాయంత్రం హాపూర్‌లోని అర్జున్ నగర్ ప్రాంతంలో ఉన్న ఓ నగల దుకాణానికి మహిళ వెళ్లింది. దాహంగా ఉందని చెప్పడంతో దుకాణ సిబ్బంది సమీపంలోని ఓ దుకాణం నుంచి నీటి సీసా కొనుగోలు చేసి తీసుకొచ్చారు. సీసా మూత తీసి ఒక గుక్క తాగిన వెంటనే ఆమె తీవ్ర మంటతో బాధపడుతూ అక్కడి నుంచి బయటకు పరుగెత్తింది. సీసాలో నీటికి బదులుగా యాసిడ్ ఉందని గుర్తించిన వెంటనే స్థానికులు ఆమెను సమీప ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు నీటి సీసా విక్రయించిన దుకాణ యజమానిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తాను ఫ్రిజ్‌లో ఉన్న సీల్ చేయబడిన సీసానే ఇచ్చినట్లు దుకాణ యజమాని పోలీసులకు తెలిపాడు. అయితే అదే దుకాణంలో కొన్ని యాసిడ్ సీసాలు కూడా లభ్యమవడంతో వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు నగల దుకాణంలోని సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయి. ప్రస్తుతం ఆ దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తూ యాసిడ్ సీసా నీటి సీసా స్థానంలో ఎలా చేరిందనే అంశంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# నటుడు ఆర్యపై మోసం కేసు నమోదు

ప్రముఖ తమిళ నటుడు ఆర్యతో పాటు ఆయన నటిస్తున్న 'అనంతన్ కాడు'*చిత్ర బృందంపై హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మోసం కేసు నమోదైంది. సినిమా చిత్రీకరణ కోసం అద్దెకు తీసుకున్న అత్యాధునిక డిజిటల్ కెమెరాలు, లైటింగ్ పరికరాలకు సంబంధించిన రూ.1.80 కోట్లకు పైగా బకాయిలు చెల్లించకుండా మోసగించారని 'తాహెర్ సినీ టెక్నిక్' సంస్థ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

బాధిత సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, గత ఏడాది ఫిబ్రవరిలో 'అనంతన్ కాడు' సినిమా చిత్రీకరణ కోసం నటుడు ఆర్య, నిర్మాత వినోద్ తమ సంస్థను సంప్రదించి అత్యంత ఖరీదైన డిజిటల్ కెమెరాలు, లైటింగ్ పరికరాలను అద్దెకు తీసుకున్నారు. ఈ పరికరాల అద్దె మొత్తం రూ.2.12 కోట్లుగా నిర్ణయించగా, అందులో కొంత మొత్తం మాత్రమే చెల్లించి మిగిలిన రూ.1.80 కోట్లకు పైగా బకాయిలను ఇప్పటి వరకు చెల్లించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సినిమా విడుదలకు ముందు మొత్తం బకాయిలు చెల్లించి 'బకాయిలు లేవు' అనే ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుంటామని చిత్ర బృందం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అయితే ఆ తర్వాత పలుమార్లు సంప్రదించినప్పటికీ స్పందించలేదని, ఫోన్ కాల్స్, సందేశాలను కూడా పట్టించుకోకుండా తప్పించుకుంటున్నారని ఆరోపించారు.

అంతేకాకుండా బకాయిల విషయమై మాట్లాడేందుకు వెళ్లిన తమ సంస్థ మేనేజర్‌ను నటుడు ఆర్య, నిర్మాత వినోద్, ఆర్య వ్యక్తిగత సహాయకుడు కిశోర్ కలిసి బెదిరింపులకు గురిచేశారని సంస్థ అకౌంటెంట్ జావేద్ అలీ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో వాస్తవాలను దాచిపెట్టి కేరళలోని న్యాయస్థానం నుంచి మధ్యంతర ఉత్తర్వులు కూడా పొందినట్లు సంస్థ ఆరోపించింది.

ఫిర్యాదు ఆధారంగా జూబ్లీహిల్స్ పోలీసులు మోసం, బెదిరింపులకు సంబంధించిన వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, ఒప్పందాలు, చెల్లింపుల వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. దర్యాప్తు అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఆరోగ్య సమస్యల వల్లే బరువు పెరిగాను: రష్మీ గౌతమ్

ప్రముఖ యాంకర్, నటి రష్మీ గౌతమ్ తన శరీరాకృతిపై ఇటీవల వస్తున్న వ్యాఖ్యలపై స్పందించారు. తాను బరువు పెరగడానికి ప్రధాన కారణం ఆరోగ్య సమస్యలేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం తన ఆరోగ్యంపై పూర్తిగా దృష్టి సారించానని, కోలుకున్న తర్వాత మళ్లీ మునుపటిలా ఫిట్‌గా కనిపించేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించారు.

తెలుగు బుల్లితెరపై ప్రముఖ యాంకర్‌గా గుర్తింపు పొందిన రష్మీ గౌతమ్ ప్రస్తుతం పలు వినోదాత్మక కార్యక్రమాలతో పాటు ఓ ప్రముఖ ఓటీటీ వేదికలో ప్రసారమవుతున్న ప్రతిభా వేట కార్యక్రమంలో న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రచారంలో భాగంగా మీడియాతో మాట్లాడిన ఆమె వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

ఈ సందర్భంగా ఒక వ్యాఖ్యాత, ఇటీవల కాలంలో మీరు కాస్త బొద్దుగా కనిపిస్తున్నారనే అభిప్రాయాలపై స్పందించాలని కోరగా, రష్మీ తన మనసులోని మాటను వెల్లడించారు. తాను ఇలా కనిపించడం తనకూ ఇష్టం లేదని, అయితే కెమెరాలో కనిపించే రూపం నిజ జీవితంలో ఉండే రూపానికి కొంత భిన్నంగా ఉంటుందని చెప్పారు. కొన్ని సందర్భాల్లో కెమెరా ప్రభావం వల్ల కూడా వ్యక్తులు వాస్తవం కంటే లావుగా కనిపించే అవకాశం ఉంటుందని వివరించారు.

అయితే తన విషయంలో బరువు పెరగడానికి ప్రధాన కారణం ఆరోగ్య సమస్యలేనని రష్మీ వెల్లడించారు. ఆ సమస్యల ప్రభావంతో శరీరంలో మార్పులు వచ్చాయని, అందువల్లే ప్రస్తుతం కాస్త బొద్దుగా కనిపిస్తున్నానని తెలిపారు. ఈ పరిస్థితి శాశ్వతం కాదని, ఆరోగ్య సమస్యల నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత మళ్లీ సన్నగా, ఆరోగ్యంగా కనిపించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

ఇంకా మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా సినీ, టెలివిజన్ రంగంలో ఎన్నో అనుభవాలు ఎదుర్కొన్నానని రష్మీ అన్నారు. విజయాలు, అపజయాలు రెండింటినీ సమానంగా స్వీకరించానని, ప్రతి అనుభవం తనకు కొత్త పాఠాన్ని నేర్పిందని చెప్పారు. అందుకే జీవితంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనే మనస్తత్వం అలవాటైందని పేర్కొన్నారు.

రష్మీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి. ఆమె ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకున్న అభిమానులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మద్దతు తెలియజేస్తున్నారు.



# 'ఐరన్ లెగ్' ముద్రపై భాగ్యశ్రీ ఆవేదన

టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయిక భాగ్యశ్రీ బోర్సే తనపై సోషల్ మీడియాలో వస్తున్న 'ఐరన్ లెగ్' వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సినిమా విజయం లేదా పరాజయానికి కేవలం కథానాయికను మాత్రమే బాధ్యురాలిగా చేయడం సరైన విధానం కాదని ఆమె స్పష్టం చేశారు. తాను నటిగా తన పాత్రకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడమే తన బాధ్యత అని పేర్కొన్నారు.

ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన భాగ్యశ్రీ, ఒక కథను అంగీకరించిన తర్వాత కూడా సినిమా నిర్మాణంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయని చెప్పారు. చిత్రీకరణ సమయంలో కథ, కథనం, సన్నివేశాలు, ఇతర అంశాల్లో మార్పులు జరగడం సహజమేనని, అలాంటి విషయాలు నటీనటుల నియంత్రణలో ఉండవని వివరించారు. అందువల్ల సినిమా ఫలితాన్ని ఒక్క కథానాయికపై మోపడం సమంజసం కాదని అన్నారు.

సినిమా విజయానికి లేదా అపజయానికి అనేక అంశాలు కారణమవుతాయని, కథ, దర్శకత్వం, కథనం, సాంకేతిక నైపుణ్యం, ప్రేక్షకుల అభిరుచి వంటి అంశాలన్నీ ప్రభావం చూపుతాయని భాగ్యశ్రీ తెలిపారు. ఈ పరిస్థితుల్లో సినిమా ఆశించిన ఫలితం సాధించకపోతే హీరోయిన్లకు 'అరిష్టం' లేదా 'ఐరన్ లెగ్' అనే ముద్ర వేయడం బాధాకరమని పేర్కొన్నారు.

అయితే నటిగా తన పాత్రను సరిగా పోషించకపోతే ప్రేక్షకులు విమర్శించే హక్కు ఉందని ఆమె అన్నారు. తన నటనలో లోపాలు ఉంటే ఎలాంటి విమర్శలనైనా స్వీకరిస్తానని, వాటి నుంచి నేర్చుకుని మరింత మెరుగైన నటిగా ఎదగడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. కానీ సినిమా ఫలితాన్ని పూర్తిగా తనపై నెట్టేయడం మాత్రం న్యాయం కాదని అభిప్రాయపడ్డారు.

ఇటీవల జరిగిన తన తాజా చిత్రం 'లెనిన్' విజయోత్సవ కార్యక్రమంలో కూడా భాగ్యశ్రీ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. వేదికపైనే కన్నీటి పర్యంతమైన ఆమె మాటలు అక్కడున్న వారిని కదిలించాయి. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలకు సామాజిక మాధ్యమాల్లో సినీ అభిమానులు, నెటిజన్ల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. సినిమా విజయం, అపజయాలకు ఒక్క నటినే బాధ్యురాలిని చేయడం సరికాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# లాంగ్ రేంజ్‌తో హీరో కొత్త విద్యుత్ స్కూటర్..

న్యూఢిల్లీ, జులై 12 (తెలంగాణ ముచ్చట్లు):

హీరో మోటోకార్ప్ తన విద్యుత్ వాహన విభాగం ద్వారా కొత్త విద్యుత్ స్కూటర్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. సుదూర ప్రయాణాలు చేసే వారిని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ స్కూటర్‌లో అధిక సామర్థ్యం గల బ్యాటరీ, వేగవంతమైన ఛార్జింగ్ సదుపాయం, ఆధునిక సాంకేతిక ఫీచర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే గరిష్ఠంగా 187 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం ఈ స్కూటర్ ప్రత్యేకతగా నిలుస్తోంది.

ఈ స్కూటర్‌లో మొత్తం 4.4 కిలోవాట్ గంటల సామర్థ్యం గల బ్యాటరీ వ్యవస్థను అమర్చారు. రెండు 2.2 కిలోవాట్ గంటల రిమూవబుల్ బ్యాటరీలతో ఇది పనిచేస్తుంది. బ్యాటరీలను సులభంగా బయటకు తీసి ఇంట్లో లేదా కార్యాలయంలో సాధారణ విద్యుత్ ప్లగ్ ద్వారా ఛార్జ్ చేసుకునే అవకాశం కల్పించారు. దీంతో ప్రత్యేక ఛార్జింగ్ కేంద్రంపై పూర్తిగా ఆధారపడాల్సిన అవసరం ఉండదు.

ఇంట్లో ఉపయోగించే ఒక కిలోవాట్ పోర్టబుల్ ఛార్జర్‌తో సున్నా నుంచి 80 శాతం వరకు ఛార్జ్ కావడానికి సుమారు మూడున్నర గంటలు పడుతుంది. అదే వేగవంతమైన ప్రత్యక్ష విద్యుత్ ఛార్జర్‌ను ఉపయోగిస్తే కేవలం 65 నిమిషాల్లోనే 80 శాతం వరకు ఛార్జింగ్ పూర్తవుతుంది. అత్యవసర పరిస్థితుల్లో ఈ వేగవంతమైన ఛార్జింగ్ వినియోగదారులకు ఎంతో ఉపయోగపడుతుంది.

దేశవ్యాప్తంగా ఆరు వేలకుపైగా వేగవంతమైన ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సంస్థ తెలిపింది. అలాగే బ్యాటరీని అద్దెకు తీసుకునే ప్రత్యేక పథకాలను కూడా అందుబాటులోకి తీసుకురావడంతో ప్రారంభ పెట్టుబడి భారం తగ్గే అవకాశం ఉంది.

ఈ విద్యుత్ స్కూటర్ మార్కెట్లోకి రాకముందే 12,111 కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసి ఆసియా స్థాయి రికార్డును నమోదు చేసింది. దీని ద్వారా స్కూటర్ పనితీరు, విశ్వసనీయతను సంస్థ నిరూపించిందని పేర్కొంది.

ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.1,43,990గా నిర్ణయించారు. ఈ నెలాఖరు నాటికి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని విక్రయ కేంద్రాల్లో అందుబాటులోకి రానుంది. అలాగే దేశవ్యాప్తంగా 700కు పైగా సేవా కేంద్రాల ద్వారా నిర్వహణ సేవలు కూడా అందించనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

సుదూర ప్రయాణ సామర్థ్యం, రిమూవబుల్ బ్యాటరీ, వేగవంతమైన ఛార్జింగ్, తక్కువ నిర్వహణ వ్యయం వంటి ప్రత్యేకతలతో ఈ కొత్త విద్యుత్ స్కూటర్ మార్కెట్లోని ఇతర మోడళ్లకు గట్టి పోటీ ఇవ్వనుందని ఆటోమొబైల్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రోజువారీ నగర ప్రయాణాలతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లే వినియోగదారులకు కూడా ఇది అనువైన ఎంపికగా నిలిచే అవకాశముందని చెబుతున్నారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in